క్లుప్తంగా

బీజేపీకి ప్రజల నుంచి సానుకూల దృక్పథం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



గుంటూరు మెడికల్: బీజేపీకి ప్రజలంతా సానుకూల దృక్పథంతో ఉన్నారని, అత్యధిక సంఖ్యలో ప్రజల నుంచి సభ్యత్వాలు చేర్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం గుంటూరు లాలుపురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఇన్‌చార్జి, జాతీయ కార్యవర్గ సభ్యుడు భారతీ మోహన్, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.సురేష్ రెడ్డి పాల్గొన్నారు. దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోను ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సురేంద్రనాథ్ రెడ్డి, పాకాలపాటి రవిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుళ్లిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో వీరభద్రుని వార్షికోత్సవం



నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శ్రీ వీరభద్రస్వామి వారి పశ్వేర జాతర వార్షిక మహోత్సవాలు-2024 గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు మేళతాళాలతో స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ గుడి చుట్టు ప్రదిక్షణలు చేసి, స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం జిల్లా కమ్యూనికేషన్ కార్యాలయం వద్ద అమ్మవారిని దర్శించుకుని, పూజలో పాల్గొన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, కుటుంబ సభ్యులు, జిల్లా ప్రజల కోసం ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఎం.వెంకటేశ్వర రావు (సెబ్), ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసరావు, బ్రహ్మానందం, ఎస్‌బీ సీఐ లు ఆనంద్, ఎ.శ్రీనిసరావు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించగా, పోలీస్ కల్యాణ మండపంలో రాత్రి అన్నదానం నిర్వహించారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

గుంటూరు వెస్ట్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని క్రీడా భారతి గత నాలుగు రోజులుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించింది. దీనికి సంబంధించి విజేతలకు గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బహుమతులు ప్రదానం చేశారు. వివిధ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శి కొసన వేణుగోపాలరావు, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అమ్మపేరిట మొక్కలు నాటే కార్యక్రమం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మశీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం లాంలోని సామాజిక విజ్ఞాన కళాశాల ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపాదించిన ''అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం''లో భాగంగా మొక్కలు నాటినట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదన రావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి జె.శివజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మాసుటికల్ విభాగాధిపతి డాక్టర్ పి.నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళిక అమలు చేయాలి

లక్ష్మీపురం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించడంలో గానీ, ఖర్చు చేయడంలో గానీ చాలా అలసత్వం చూపుతూ క్రీడలను ప్రాధాన్యత లేని అంశంగా చూడటమే క్రీడాకారులకు నేడు శాపంగా మారిందని రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ ప్రసంగించారు.

విజ్ఞాన్‌లో క్రీడా పోటీలు

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు గ్రామంలో ఉన్న విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో అవసరం అన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

హాస్యంతో మెప్పించిన నటుడు పద్మనాభం

లక్ష్మీపురం: ఆహార్యం, సంభాషణ చాతుర్యంతో హాస్య రస పోషణలో ప్రత్యేక వరవడిని సృష్టించిన పద్మనాభం తెలుగు ప్రేక్షకుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారని సినీ రంగ విశ్లేషకులు అసోసియేటెడ్ డైరెక్టర్ కనగాల జయకుమార్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సినీ హాస్యనటుడు పద్మనాభం జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

కాపాడే చేతులనే నరికేస్తున్నారు



సైనిక వ్యవస్థ దేశాన్ని కాపాడుతుంటే ప్రజల ప్రాణాలను వైద్యులు కాపాడుతున్నారు. కరోనా, టీబీ, హైపటైటిస్, హెచ్ఐవీ వ్యాధులకు గురైన వైద్యులు, సిబ్బంది ఉన్నారు. సైనికులకు ఇస్తున్న గౌరవం వైద్యులకు లేదు. పైగా నిత్యం దాడులు పరిపాటైంది. మహిళలపై హత్యాచారాలు సాధారణమైంది. మాకు రెండు వేల సభ్యులు విమెన్ డాక్టర్స్ అసోసియేషన్ వాట్సాప్ గ్రూపుంది. దీనిలో ప్రతిరోజూ ఏదొక కేసు రిపోర్టు అవుతోంది. కాపాడే చేతులనే నరికేస్తే ఎలాగా? రేపిస్ట్ ఈజ్ ఆల్వేస్ రేపిస్ట్...వాళ్లు బతకటం దండగ. మరణశిక్ష అమలు చేయాల్సిందే ! – డాక్టర్ పావనీ ప్రియాంక, కార్యదర్శి, ఐఎంఏ, తెనాలి



దారుణాలు ఇక సహించలేం

మహిళలకు ఎక్కడుంది స్వాతంత్ర్యం అనిపిస్తోంది. రాత్రి డ్యూటీలు చేసే మహిళలకు రక్షణ లేదు. 8 గంటల పనివేళలు డాక్టర్లకు ఎందుకు లేవు. 36 గంటల డ్యూటీలేంటి ? ఇంట్లో, పని ప్రదేశంలో విధుల్లో మానసిక ఒత్తిడికితోడు శారీరక హింస ఏమిటి? ఇకపై సహించే పరిస్థితి లేదు. మద్యం, డ్రగ్స్ తీసుకునే దారుణాలకు పాల్పడుతున్నారు. అలాంటివారు బయటకొస్తే కఠిన శిక్షణ విధించాలి. రాత్రి డ్యూటీలు, పని ప్రదేశాల్లో రక్షణకు తగిన చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ హిమని, రేడియాలజిస్ట్, తెనాలి





అవగాహన కార్యాలయంలో జరిగిన సభలో మాట్లాడుతున్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు



పాటిబండ్ల సీతారామయ్య స్కూల్లో అష్టదిగ్గజ కవుల వేషధారణలోని విద్యార్థులతో విష్ణువర్ధన్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, కన్న మాస్టారు



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సురేష్‌రెడ్డి, వనమా నరేంద్ర, నాయకులు

తెలుగు భాషకు జీవం పోసిన వైతాళికుడు గిడుగు

- మాజీ తెలుగు అధ్యాపకులు, కవి డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు
- నగరంలో పలు ప్రాంతాల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నగరంపాలెం: వ్యవహారిక భాషకు జీవం పోసిన వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి అని ప్రముఖ కవి, రచయిత, సరస్వతీపుత్ర డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం, అవగాహన సంస్థ ఆధ్వర్యంలో గురువారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు, తెలుగు భాష దినోత్సవం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిక్కన సాహిత్యంలోని దేశీయత, సరళతతో రాసాత్మకంగా మానవీయత పాత్రలతో భారతాన్ని ఆవిష్కరించారన్నారు. వచనానికి నాడే నాందీ పలికారని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో కవులు షేక్.మస్తాన్ బాబు, ఎన్‌సీ.సుధా మైథిలి, డి.అనిల్‌నాయక్, యక్కంటి పద్మావతి, చుండూరు శేషమాంబ, బండికల్లు జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, సింగరయ్య పాల్గొనగా, ఉత్తమ కవితా నగదు పురస్కారాన్ని సుధామైథిలీ, డి.అనిల్‌నాయక్ అందజేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి షేక్.ఖాసీంబి, రచయితల సంఘం కోశాధికారి నారిశెట్టి వెంకట సత్యనారాయణ (నానా), ఎ.వి.కె.సుజాత, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, వశిష్ట సోమేపల్లి, గురవయ్య, సదా శివన్, బిక్కి అశోక్ పాల్గొన్నారు.

తెలుగుభాష గొప్పదనాన్ని చాటారు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాష గొప్పదనాన్ని చాటిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అన్నారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గిడుగు వెంకట రామ్మూర్తి జీవిత విశేషాలపై విద్యార్థులు తెలుగు గీతాలు, శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలోని అష్ట గిగ్గజ కవులతో ఉపన్యాసాలు, కవితలు, నత్య రూపకాలతో నాటక ప్రదర్శన, ప్రాచీన ఆధునిక కవుల సాహిత్య పటిమను పద్యాల రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాద్ రావు, డైరెక్టర్ లేళ్ల కష్ణవేణి, ప్రిన్సిపాల్ శ్రీమతి జంపని పద్మజ, కో-ఆర్డినేటర్స్ డి.దుర్గా శ్యామ్, టి.శ్రీదేవి, బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజ్ఞ పాఠశాలలో..

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని ప్రజ్ఞా విద్యాసంస్థల్లో తెలుగు వ్యవహారిక భాష ఉద్యమంలో ఎనలేని కృషిచేసిన గిడుగు రామమూర్తి జయంతోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాష ప్రాధాన్యతపై ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు వక్తృత్వం, పద్యాలు, పాటలు, నృత్య రూపకాల పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమ పాఠశాల అయినప్పటికీ తల్లి భాష అయిన తెలుగు భాషా ప్రాధాన్యాన్ని విద్యార్థులకు బోధనతో పాటు అనేక కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెనడి నెక్స్‌జెన్‌లో...

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ భాషలందు తెలుగు భాష గొప్పదని కెనడి నెక్స్‌జెన్ డైరెక్టర్ కె.శ్రీవిద్య అన్నారు. అరండల్‌పేట 2వలైనులోని నెక్స్‌జెన్ పాఠశాలలో గురువారం గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాష దినోత్సవంతో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు చెప్పిన చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి గలవోడా అనే వేములపల్లి గీతం ఆలపించిన తెలుగు వారి కీర్తిని కొనియాడారన్నారు. దేశంలో అత్యధికులు మాట్లాడుకునే భాష తెలుగు భాష అన్నారు. ఆగస్టు 29న తెలుగు భాష దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. పాఠశాల ఇన్‌చార్జి కె.వసంతలక్ష్మి మాట్లాడుతూ తెలుగు కవి గిడుగు రామమూర్తి పంతులు జయంతి రోజున తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను గౌరవించి తెలుగు భాష దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన బుర్రకథ, తెలుగుతల్లి సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.లక్ష్మి, డి.భారతీ లక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెనడి మెరిట్ క్యాంపస్‌లో ..

పాఠశాల ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శారదానికేతనంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని శ్రీశారదానికేతనంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రామినేని పద్మావతి, కేఎస్సార్టీ నగరపాలక సంస్థ తెలుగు ఉపాధ్యాయిని డాక్టర్ సుధా మైథిలీ విద్యార్థినులకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేశారు.

కార్యక్రమంలో జిల్లా కబడ్డీ కోచ్ కె. లక్ష్మీరమణ, చాగంటి సుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సీహెచ్ హరిపావని, సంస్థ కార్యనిర్వహణాధికారి జి. శ్రీనివాసరావు, ఓరియెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, హైస్కూల్ హెచ్ఎం ఎస్. ఉషాకుమారి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సుమేధ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృభాషలోని మాధుర్యాన్ని మరువరాదని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఎన్జీవో కాలనీలోని సుమేధ స్కూల్లో మాతృభాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని పలికిన శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఎందరో మహనీయులు, కవులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటారని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు అచ్చతెలుగు సంప్రదాయ వేషధారణతోపాటు కవుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

గుంటూరు మెడికల్: తెలుగు భాష దినోత్సవ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ ఉపాధ్యక్షుడు సురేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్, ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి పునుగుళ్ళ రవిశంకర్, ఆరవ మండల అధ్యక్షుడు లంకా రవిశంకర్, వెంకటరమణ, బాదం శ్రీనివాస్, మాధవ్ కృష్ణ, సాయి రాధాకృష్ణా, అజయ్ కుమార్, మంజునాథ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు అజరామరం

గుంటూరు ఎడ్యుకేషన్: రెండువేల సంవత్సరాల తెలుగు భాషా చరిత్రలో గ్రాంథిక భాషను సరళమైన వ్యావహారిక భాషగా మార్చేందుకు గిడుగు రామమూర్తి చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఒక్క భారతదేశమే భిన్న భాషలు సంస్కృతులతో, భిన్నత్వంలో ఏకత్వంతో విరాజిల్లుతోందన్నారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికీ, మాతృభాషకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి అనంతరం గురజాడ వెంకట అప్పారావు, కందుకూరి వీరేశలింగం, శ్రీ శ్రీ తదితరులు ఆధునిక వ్యవహారిక తెలుగు భాషా వికాసానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాషాభివృద్ధికి బాటలు వేసిన గిడుగు రామ్మూర్తి పంతులు నిత్య స్మరణీయులని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ సమాజంలో మమ్మీ, డాడీ సంస్కృతిని విడనాడి అమ్మ, నాన్న పదాలను వాడాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయురాలు యు. రమాదేవి మాట్లాడుతూ అన్ని భాషల్లో కెల్లా తెలుగు భాష అమృతమైన భాష అని, తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు పలు క్రీడా విన్యాసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవిశేఖర్ పాల్గొన్నారు.



కెనడి నెక్స్‌జెన్‌లో బుర్రకథ, తెలుగు తల్లి వేషధారణల్లో ఉన్న విద్యార్థులను అభినందిస్తున్న కె.శ్రీవిద్య, వసంతలక్ష్మి

డాక్టర్ కేవీపీ పబ్లిక్ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: మాతృభాషలో రాణించడం ద్వారా అన్ని రంగాల్లోనూ గుర్తింపు పొందగలరని న్యూఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు కంచర్ల రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేవీపీ పబ్లిక్ స్కూల్లో గురువారం మాతృభాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడాదినోత్సవాన్ని జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామ్‌ప్రసాద్ క్రీడాజ్యోతిని వెలిగించి, బెలూన్లను ఎగురవేశారు. మాతృభాషపై పట్టు సాధించడంతో పాటు క్రీడాసక్తితో విద్యార్థులు భావి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భాషతో పాటు క్రీడల్లో నిష్ణాతులైన ఇరువురి గొప్ప వ్యక్తుల జయంతిని పాఠశాలలో నిర్వహించడం ద్వారా వారి స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మాతృభాష ద్వారా విలువలతో కూడిన సంస్కారం అలవడుతుందని, విదేశీయులు సైతం తెలుగుభాషపై ప్రశంసలు కురిపించారన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడాంశంలో నైపుణ్యం సాధించేందుకు తగిన శిక్షణ పాఠశాలలో కల్పిస్తున్నామని తెలిపారు. మాతృభాషను అమ్మభాషగా గుర్తించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రామ్ ప్రసాద్, డాక్టర్ కృష్ణప్రసాద్, రత్తయ్య

ఆకట్టుకున్న సాహిత్య రూపకం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. ఈ క్రమంలో తెలుగు భాషా సౌరభాలు సాహిత్య రూపకం ఆకట్టుకుంది. జనచైతన్య సంస్థ అధ్యక్షులు మాదల రత్నగిరిబాబు, ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, సాహితీవేత్త తూనుగుంట్ల రాధాభాయి అధ్యక్షత వహించారు. రూపకానికి ప్రయోక్తగా తెలుగు తల్లిగా డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మీ చక్కని సమన్వయం చేశారు. పద్యపఠనానికి డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మి, జానపదానికి డాక్టర్ చల్లా సీతామహాలక్ష్మి, శతక పఠనానికి డాక్టర్ ఎన్‌సీహెచ్.సుధామైథిలి, వచన కవిత్వానికి డాక్టర్ వేమూరి సత్యవతి, గజల్‌కి పెదపోలు శాంతి, నిర్మల హాజరై, తమ కవితలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సాహితీవేత్తలను సత్కరించగా, డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



ప్రభుత్వ పాఠశాలలో క్రీడా విన్యాసాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులతో హెచ్ఎం ఖాసిం



గార్డెన్స్ వెంకటేశ్వర దేవాలయంలో మాట్లాడుతున్న రాధాభాయి



ప్రజ్ఞ స్కూల్లో విద్యార్థులతో చక్రనాగ్, కోటేశ్వరరావు



సుమేధ హైస్కూల్లో విద్యార్థులతో చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

పట్నంబజారు: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ వి.వి.సుబ్బారావు, పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈనెల 26వ తేదీన పాతగుంటూరు పరిధిలోని రాఘవనగర్‌లో అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ పూటుగా మద్యం సేవించితన భార్య మౌనికను క్రికెట్‌బ్యాట్‌తో తలపై మోదడంతో గాయాలయ్యాయి. బాధితురాలిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 27వ తేదీ ఉదయం మృతి చెందింది. అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన అంకమ్మరావు గత 11 సంవత్సరాల క్రితం గుంటూరు సెంట్రింగ్ పనులకు వచ్చి మణిపురం 1వలైనుకు చెందిన మౌనిక (24)తో పరిచయం ఏర్పడడంతో ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. మృతురాలు ఆటోనగర్‌లోని ప్లాస్టిక్ డబ్బాల కంపెనీలో పనిచేస్తుండగా, అంకమ్మరావు వాసవీ కాంప్లెక్సులోని బట్టల కొట్టులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసగా మారి నిత్యం భార్యపై అనుమానం పడి, కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురిచేస్తూ కొడుతుండేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 26వ తేదీ రాత్రి పూటుగా మద్యం సేవించి వచ్చి భార్య మౌనికతో వివాదం పెట్టుకుని క్రికెట్‌బ్యాట్‌తో ఆమె తలపై మోదడంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈక్రమంలో ఈనెల 28వతేదీ సాయంత్రం 6 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అంకమ్మరావును పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై పి.భాగ్యరాజ్, హెడ్‌కానిస్టేబుల్ కె.కోటేశ్వరరావు, నూరుద్దీన్, యోహాన్, కె.యోహాన్, అనిల్, శామ్యూల్‌రాజ్, మురళి, హనుమాన్‌సింగ్‌లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుబ్బారావు

జాతీయ సమావేశాలు విజయవంతం చేయాలి

లక్ష్మీపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి కార్మికుల హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై భవిష్యత్ పోరాటాల కోసం సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. స్థానిక గుంటూరు బస్టాండు వద్ద గల సివిల్ సప్లయిస్ గొడౌన్స్ ప్రాంగణంలో గురువారం 3న విశాఖపట్నం నగరంలో శ్రామిక ప్రదర్శన సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాపితంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని కార్మిక వర్గం పై రాజకీయ కక్ష సాధించి చర్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

చంద్రబోస్ సేవలు మరువలేనివి



నగరంపాలెం: చంద్రబోస్ సేవలు మరువలేనివి అని పలువురు వక్తలు, అధికారులు కొనియాడారు. గురువారం కాకానిరోడ్డులోని బైబిల్ కళాశాల ఎదురు ప్రాంగణంలో గురువారం రెవ.డాక్టర్ పీఎస్ఎస్.చంద్రబోస్ 75వ జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే గళ్లా మాధవి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్, మాజీ డీజీపీ స్వరణ్‌జీత్‌సేన్, సీనియర్ ఐఏఎస్‌లు కాంతిలాల్ దండే, కోన శశిధర్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు లీలాబోస్ తదితరులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గాస్పెల్ మిషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీవన్, అన్నంరాజు సాయిరాం, డాక్టర్ రాగ దీపిక, బైబిల్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: గుర్తుతెలియని వ్యక్తి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు నుండి ప్రమాదవశాత్తు జారి పడడంతో రైల్వే పోలీసులు జీజీహెచ్‌కు తరలించినట్లు జీఆర్పీ సీఐ అంజిబాబు గురువారం తెలిపారు.